వరినాట్లకు వలసకూలీలు

- జిల్లాలో ఉపాధి పొందుతున్న వివిధ రాష్ట్రాల ప్రజలు
- గ్రామాల్లోనే బస
- నారు తీసి నాటు వేసే వరకు అన్ని పనులు వేస్తున్న వైనం



చామన్‌పెల్లి సమీపంలో వరి నాటు వేస్తున్న కూలీలు



లక్ష్మణచాంద మండలం మునిపెల్లిలో వరి నారు తీస్తున్న కూలీలు

లక్ష్మణచాంద: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. భారీగా కురిసిన వర్షాలతో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో పొలం పనులు చేసేందుకు స్థానికంగా కూలీలు దొరకడం లేదు. ఈ తరుణంలో ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి పలువురు జిల్లాకు వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. సకాలంలో వరినాట్లు పూర్తి చేయాలనే ఉద్దేశంతో మన రైతులు సైతం వలస కూలీలతో పనులు చేయించుకుంటున్నారు. లక్ష్మణచాంద మండలానికి వివిధ రాష్ట్రాల నుంచి వరినాట్లు వేసేందుకు వచ్చారు.

అక్కడ ఉపాధి లేక ..

పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పనులు లేకపోవడంతో రెండేళ్లుగా ఏటా వరినాట్ల సమయంలో తెలంగాణకు వచ్చి ఉపాధి పొందుతున్నట్లు వలస కూలీలు పేర్కొంటున్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది జిల్లాలోని లక్ష్మణచాంద మండలానికి వచ్చారు. ఇక్కడ వరినాట్లు వేస్తూ ఉపాధి పొందుతున్నారు.

రోజుకు 3 నుంచి 4 ఎకరాలు..

వరినారు తీయడం, తీసిన నారును మడుల్లో పర్చుకోవడం, మందు చల్లడం, అనంతరం నాటు వేసుకోవడం వంటి పనులన్నీ ఈ కూలీలే చేస్తారు. ఉదయమే ఏడు గంటలకు పొలంలోకే దిగుతారు. 20 మంది కలిసి గ్రూపుగా ఏర్పడతారు. ఒక రోజుకు మూడు నుంచి నాలుగెకరాల వరకు నాట్లు వస్తున్నట్లు గ్రూప్‌లోని కూలీలు పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.ఐదు వేలు..

లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి, చామన్‌పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో ఇప్పటికే వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణ రకంలో ఎకరంలో నాటు వేసేందుకు రూ.ఐదు వేలు, సీడ్ రకం వరి నాటు వేసేందుకు రూ.ఆరు వేలు తీసుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఒక గ్రూపులోని కూలీలం రోజుకు మూడు నుంచి నాలుగెకరాల్లో వరినాట్లు వేస్తున్నామని.. ఒక్కొక్కరికి రోజుకు రూ.1000కు పైగా గిట్టుబాటు అవుతుందని ఆయా రాష్ట్రాల కూలీలు పేర్కొంటున్నారు.

రోజుకు రూ.వెయ్యి..



20 మందిమి కలిసి గ్రూపుగా ఏర్పడ్డాం. రోజుకు మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు నాటు వేస్తున్నాం. రోజుకు రూ.వెయ్యికి పైనే గిట్టుబాటు అవుతుంది.

– ఉపేందర్, పశ్చిమబెంగాల్

స్థానిక కూలీలు దొరకలేదు



మాది లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి. నాలుగు ఎకరాల్లో సీడ్ రకం వరి సాగు చేస్తున్నా. వరినాట్లు వేసేందుకు స్థానిక కూలీలు దొరకలేదు. సకాలంలో పూర్తవుతుందని.. బీహార్ కూలీలకు ఎకరాకు రూ.ఆరు వేలు చెల్లించి నాటు వేయించా.

– నూకల మల్లయ్య, రైతు, చామన్‌పెల్లి

నాటు మంచిగ వేశారు



మాది లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి. మాకున్న పొలంలో ఇప్పటికే రెండు ఎకరాలు పశ్చిమబెంగాల్ కూలీలతో నాటు వేయించా. ఎకరాకు రూ.ఐదు వేలు ఇచ్చినాం. నాటు వరుస క్రమంలో సకాలంలో పూర్తి చేశారు.

– మెతుకు రమేశ్, రైతు, చామన్‌పెల్లి

ఉపాధి పొందుతున్నాం



మాది బీహార్ రాష్ట్రం. అక్కడ ఈ సమయంలో సరైన కూలీ పనులు లేవు. దీంతో ఇక్కడ వచ్చాం. వరినాట్లు వేస్తూ ఉపాధి పొందుతున్నాం. ఇక్కడి రైతులు కూడా మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు.

– కపలేశ్వర్ సహని, బీహార్ కూలీ

7 గంటలకే పనికి..



మండలంలోని మునిపెల్లి గ్రామానికి వరినాటు వేసేందుకు వచ్చాం. ఇక్కడ రోజు ఉదయం ఏడు గంటలకే పొలాలకు వెళ్లి.. సాయంత్రం 6 గంటల వరకు నాటు వేస్తున్నాము.

– గోవింద్ యాదవ్, ఉత్తరప్రదేశ్

విరగ బూసిన మామిడి



లక్ష్మణచాంద: మండలకేంద్రం నుంచి నిర్మల్ వెళ్లే మార్గంలో పొట్టపెల్లి(కే) సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న మామిడి చెట్టు పూతతో దర్శనమిస్తోంది. కొమ్మ కనిపించకుండా పూతనే పసుపు వర్ణంలో మెరుస్తూ వచ్చిపోయేవారికి ఆహ్లాదం పంచుతోంది

తప్పనిసరిగా టీకాలు వేయించాలి



సూచనలు చేస్తున్న వైద్యుడు శివకుమార్

కడెం: చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామంలో నిర్వహించిన ఇమ్యునైజేషన్ శిబిరం సందర్శించారు. ఈసందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసే తీరు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో వేణుగోపాల్, పలువురు వైద్యసిబ్బంది మౌనిక, రాధ, జ్యోతి, రాజేశ్వర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఓబన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సాపూర్(జి): స్వాతంత్య్ర సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతిని శనివారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిన్నరామయ్య, రాంరెడ్డి, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, కొంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, దత్తురాం, గంగారాం, శంకర్, పల్లపురాజు, రాము, నాగరాజు, సాయిలు, జక్కన్న తదితరులు పాల్గొన్నారు.

సఖి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



అవగాహన పోస్టర్లతో మహిళలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం సఖి కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. శ్రీనగర్ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సఖి సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటివ్ శ్వేతారాణి, పారా మెడికల్ అసిస్టెంట్ సవిత, శ్రీనగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఆటలపోటీలతో సంపూర్ణ ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ నైలు

భైంసారూరల్: ఆటపోటీలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని భైంసా సీఐ నైలు అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో టీపీఎల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలన్నారు. దీంతో స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో చెన్న చిన్నరాములు జ్ఞాపకార్థం గొల్లమాడ ప్రీమియర్ లీగ్–4 (జీపీఎల్–4) క్రికెట్ పోటీలను ఆ గ్రామ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్ శనివారం ప్రారంభించారు. ప్రథమ బహుమతిగా రూ.8వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేల నగదుతోపాటు ట్రోఫీలను అందజేస్తామని గ్రామానికే చెందిన చెన్న రాజు ప్రకటించారు. కార్యక్రమంలో పాపెన్ రాజేశ్వర్, దీక్షిత్ పాటిల్, నాకిడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



తానూరు: మండలంలోని మాహలింగి గ్రామంలో ఈగల రాజన్న అనే రైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. శనివారం ఉదయం రాజన్న ఆవులను మేపేందుకు గ్రామశివారులోకి తోలుకెళ్లాడు. ఓ ఆవు మేస్తూ విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లి తీగలకు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని.. ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

13 నుంచి భూసార్ బీట్ బంద్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మూడు రోజులపాటు భూసార్ బీట్ తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పూర్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13 నుంచి 15 వరకు కొనుగోళ్లు నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. తిరిగి 16 న యథావిధిగా బీట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



నర్సాపూర్(జి): మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

నర్సాపూర్(జి): క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. నర్సాపూర్(జి) జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కేడీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఆటలపోటీల్లో గెలుపోటములు సహజమని.. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి చాటాలని సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాం కిషన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు సుభాశ్‌రావు, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, కొంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, గొల్లమాడ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, టోర్నమెంట్ దాత కట్కం దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

భైంసాటౌన్: పట్టణంలోని తన నివాసంలో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌పటేల్ పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు, సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



సోన్ : భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు

సోన్: మండలకేంద్రంలోని అభ్యాస గురుకులంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. బాలురు గాలిపటాలు ఎగురవేయగా.. బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బెల్‌తరోడాలో విజేత మోడల్ పాఠశాలలో శనివారం మకర సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అతిథిగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఠాకూర్ ఈశ్వర్‌సింగ్ హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలు వివరించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం భోగి మంటలు వేశారు. ప్రిన్సిపాల్ గణేశ్, నిర్వాహకులు రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తానూరు : ఓ పాఠశాల వేడుకల్లో అధికారులు

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

- 108 గంగాళాల్లో పాయసం నివేదన



పూజలు చేస్తున్న అర్చకులు

భైంసాటౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కూడార్ై మహోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో వేదికపై అమ్మవార్ల సమేత స్వామివారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. 108 గంగాళాలల్లో పాయసం నైవేద్యంగా సమర్పించారు. అర్చకులు నక్షత్ర హారతి సమర్పించగా..భక్తులు భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ప్రవచనాలు చేశారు.

ఈరోజు

సప్తాహం ప్రారంభం

బాసర: మండలకేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 19వరకు హరి నామ సప్తాహం నిర్వహించనున్నట్లు అర్చకులు భూమానంద యాదవ్ మహారాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం కుమారి దీది వైష్ణవిగౌడ్ ఆధ్వర్యంలో భగవద్గీత, గీత పారాయణం, అఖండ హరినామ సప్త, గురు చరిత్రను భక్తులకు వివరిస్తారు. తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తీర్థప్రసాదం, అన్నప్రసాదం ఉంటుందని అన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మామడ: మండలకేంద్రంలోని రైతువేదికలో ఆదివారం మాలసంక్షేమ సంఘ మామడ మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ తెలిపారు. శనివారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడారు. మండలంలోని గ్రామాల నుంచి మాల సంఘ నాయకులు ఉదయం 11 గంటల్లోగా రావాలని కోరారు. దేవ్వళ్ల మధు, సంపెర్ల రత్నయ్య, సూర్య, సుధాకర్ నవీన్, గంగన్న పాల్గొన్నారు.

ఇంకెప్పుడు తరలిస్తరు..?



కుంటాల పీఏసీఎస్ కార్యాలయంలో పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

- 25 రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే మూడు వేల సోయా బస్తాలు
- లారీల కొరత కారణమంటున్న పీఏసీఎస్ సిబ్బంది
- పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నామంటున్న రైతులు

కుంటాల: వానాకాలంలో పండించిన సోయా పంటను కొనేందుకు మూడు నెలల కిందట కుంటాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. మద్దతు ధర రూ.4,892 చెల్లించి మండలంలోని రైతుల నుంచి పంటను కొనుగోలు చేశారు. ఇంకా తూకం వేసిన 3,000 బస్తాలు(1500 క్వింటాళ్లు) 25 రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. లారీల కొరత కారణంగా ఈ బస్తాలను తరలించడంలో జాప్యం నెలకొందని పీఏ ఎస్ సిబ్బంది పేర్కొంటున్నారు. బస్తాలను తరలించకపోవడంతో తరుగు వచ్చి నష్టపోయే ప్రమా దం ఉందని రైతులు దిగులు చెందుతున్నారు. పంటల పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నామని.. వెంటనే సోయా బస్తాలను తరలించి తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన



కుభీర్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

- ఎస్సై నచ్చజెప్పడంతో ధర్నా విరమణ

కుభీర్: సమయపాలన లేని విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం కుభీర్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు . వ్యవసాయానికి ఒకరోజు ఉదయం 6 గంటలకు, మరో రోజు రాత్రి 12 గంటలకు, ఇంకో రోజు రాత్రి 2 గంటలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారని రైతులు తెలిపారు. దీంతో ఇబ్బందులు పడాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సిబ్బంది స్థానికంగా ఉండడం లేదని, ప్రతీ పనికి డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. గురువారం రాత్రి ఒక షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగితే సరఫరా నిలిపివేయడానికి ఎవరూ అందుబాటులో లేరని తెలిపారు. ఏఈకి ఎన్ని సార్లు ఫోన్‌చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఏఈ ఆదిత్యనాథ్ ధర్నా వద్దకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడారు. తనకు ఏఈతోపాటు ఇన్‌చార్జి ఏడీఏ బాధ్యత ఉందని తెలిపారు. కుభీర్ సబ్‌స్టేషన్‌పై అధిక లోడ్ పడుతోందని పేర్కొన్నారు. బూర్గుపల్లి సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఇస్తున్నామని తెలిపారు. త్వరలో మాలేగాం సబ్‌స్టేషన్ అందుబాటులోకి వచ్చి సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. అనంతరం ఎస్సై పి.రవీందర్ రైతులకు నచ్చజెప్పడంతో వారంతా ఆందోళన విరమించారు. రాస్తారోకోలో కుభీర్, జామ్‌గాం, పార్డి(కె), రాజుర గ్రామాల రైతులతోపాటు బీజేపీ జిల్లా కార్యదర్శి పి.గంగాధర్, మండల అధ్యక్షుడు దత్తాత్రి, పలువురు రైతు నాయకులు నాగలింగం, కె.నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



గ్రామస్తులతో మాసాయిపేట్ కళాకారులు

కడెం: విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక మాజీ సలహాదారు కేవీ రమణాచారి వృద్ధ కళాకారులపై ఔదార్యం చాటుకున్నారు. కేవీ రమణాచారి ఆదేశాల మేరకు మండలంలోని మాసాయిపేట్‌కు చెందిన కవి, గాయకుడు గుగ్లావత్ గంగారాం.. అదే గ్రామానికి చెందిన ముంజ నారాయణగౌడ్, బుర్ర రామగౌడ్, నాగిల్లా హన్మంతు, గడ్డం ఎల్లయ్య అనే వృద్ధ కళాకారులను శనివారం గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సత్కరించి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు హైమద్, ఉపాధ్యాయుడు కూచనపల్లి శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర రమేశ్‌గౌడ్, గూగ్లావత్ గంగారాం, ఆర్మీ జవాన్ రాకేశ్, గ్రామస్తులు బుచ్చి నర్సయ్య, లక్ష్మీ నర్సయ్య తదితులున్నారు.

రెడ్డి ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యవర్గం



మాట్లాడుతున్న మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

మామడ: జిల్లాకేంద్రంలోని రాజరాజేశ్వర కల్యాణ మండపంలో శనివారం రెడ్డి ఉద్యోగ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రెడ్డి ఉద్యోగుల సంక్షేమ సంఘం (రేవా) జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.ప్రవీణ్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా వై.ధర్మ జీవన్‌రెడ్డి, కోశాధికారిగా ఇ.ఆనంద రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.మనోహర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె. హంసలత, జాయింట్ సెక్రెటరీగా ఇ.సంగీత ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు నిర్వాహకులు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, మురళి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సోన్: మండలంలోని గాంధీనగర్, మాదాపూర్ గ్రామాలకు చెందిన పహిల్వాన్, పూంద్రు నర్సారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబసభ్యులను వారి ఇంటికి వెళ్లి బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి అల్లూరి కృష్ణవేణి పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎంబరి గంగాధర్ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన ఎగ్గం గణేశ్ ఇటీవల మృతి చెందగా.. శనివారం బాధిత కుటుంబాన్ని ముధోల్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, దాసరి కిషన్, రమేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

ప్రేంసింగ్‌ను కలిసిన ఎమ్మెల్యే



మహరాజ్‌తో ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: బంజారాల పవిత్రస్థలం, దీక్షభూమి నార్నూర్ మండలంలోని కొత్తపల్లిలో దీక్ష గురు సంత్ ప్రేంసింగ్ మహరాజ్‌ను ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ శనివారం కలిశారు. గురుకృప దినోత్సవం సందర్భంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మహారాజ్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు, బంజారా నాయకులు ఉన్నారు.